పరిధి కాకున్నా పవర్ పాయింట్

- విదేశాల నుంచి రాగానే హైడ్రాపై ప్రెస్‌మీట్
- చెరువుల ఆక్రమణలు అంటూ పీపీటీ విడుదల
- ముఖ్యమంత్రి మాటలకు భిన్నంగా వ్యాఖ్యలు
- మున్సిపల్, ఇరిగేషన్.. ఏదీ ఆయనది కాదు
- అయినా గంటన్నర సేపు మీడియాతో ముచ్చట్లు
- డిప్యూటీ సీఎం భట్టి వైఖరిపై కాంగ్రెస్‌లో గుసగుసలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): విదేశీ పర్యటన ముగించుకుని వచ్చీ రాగానే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హడావుడిగా హైడ్రాపై ప్రెస్‌మీట్ పెట్టారు. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలు అంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపు గంటన్నర సేపు మీడియాతో ముచ్చటించారు. ఇంతకు వరకు బాగానే ఉంది. కానీ భట్టి మాటలే అనేక సందేహాలకు తావిచ్చాయి. చెరువులు, మూసీ సుందరీకరణ తదితర అంశాలన్నీ ఇటు పురపాలక, అటు ఇరిగేషన్ శాఖకు సంబంధించినవి. వీటిపై సంబంధిత శాఖల మంత్రులు మాట్లాడితే దానికో అర్థం ఉంటుంది. కానీ, ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో ఉండగానే ఇక్కడ అంతా తానై మీడియా సమావేశం నిర్వహించడంపై కాంగ్రెస్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. విదేశీ పర్యటనలో తాను సందర్శించిన థేమ్స్ నది గురించి ప్రస్తావిస్తూనే.. డిప్యూటీ సీఎం హెచ్ఎంఏడీ పరిధిలోని చెరువులన్నింటినీ మళ్లీ సర్వే చేస్తామని బాంబు పేల్చారు. అంతేకాదు చెరువుల ఆక్రమణలపైనా ఏకరవు పెట్టారు. ఆర్థిక శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం.. ఇంత హడావుడి చేయడంపై అధికారవర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. దీనికి ఉప ముఖ్యమంత్రి ఓ సమాధానం చెప్పారు. టీజీ ర్యాక్ (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్) తన పరిధిలోనేదే అంటూ సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. నిజమే... ప్రణాళిక విభాగంలో అదీ ఒక భాగమే. కానీ చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, ఆక్రమణలు అనేది దాని బాధ్యత కాదు కదా!! కేవలం సాంకేతిక సహకారం మాత్రమే కదా ర్యాక్ ఇచ్చేది అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాదు... డిప్యూటీ సీఎం లాజిక్ ప్రకారం టీజీ ర్యాక్ వంటి చిటికెన వేలు బంధంతో అది సాంకేతిక సహకారం అందించే ప్రతి శాఖపైనా డిప్యూటీ సీఎం సమీక్షలు చేపట్టే అవకాశం ఉంటుంది.. నిర్ణయాలు ప్రకటించే అధికారం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ ప్రాజెక్టులే టార్గెట్‌గా?!

భట్టి ప్రజెంటేషన్‌లో పలు ఆసక్తికర, అనుమానాస్పద అంశాలు ఉన్నట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చెరువుల ఆక్రమణలే జరగనట్టు డిప్యూటీ సీఎం మాటల్లో ధ్వనించింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెరువుల పరిరక్షణ కంటే.. బీఆర్ఎస్‌ను సాధించాలనే రాజకీయ దురుద్దేశమే ఉందని భట్టి మాటల్లో స్పష్టమైంది. ప్రజెంటేషన్‌లో చెరువులు, ఆక్రమణల గుర్తింపు అశాస్త్రీయంగా కనిపించిందనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 65 చెరువుల కబ్జాలను పొందుపరచగా.. 11 బడా నిర్మాణ ప్రాజెక్టులను ఉదహరించారు. వీటిని మాత్రమే టార్గెట్ చేయడంపై భట్టి ఉద్దేశమేమిటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డిజిటల్ సర్వేకు ఏఈవోల అంగీకారం

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): డిజిటల్ క్రాప్ సర్వే చేసేందుకు ఏఈవోలు అంగీకరించారు. ఈ మేరకు ఉద్యోగుల జేఏసీ మంగళవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో చర్చలు జరపగా... ఏఈవోల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో డిజిటల్ క్రాప్ సర్వేకు ఏఈవోలు అంగీకరించారు. రేపటి నుంచే సర్వే ప్రారంభించాలని, సర్వేలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు వెల్లడించారు. కేంద్ర పథకం డిజిటల్ క్రాప్ సర్వేను చేయబోమని, ఈ కార్యక్రమంతో తమకు పనిభారం ఎక్కువవుతున్నదని ఏఈవోలు సర్వేను బహిష్కరించారు. దీంతో ఉద్యోగుల జేఏసీ కల్పించుకొని ప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఉద్యోగుల జేఏసీ వైర్మన్ లచ్చిరెడ్డి, నాయకుడు రామకృష్ణ, ఏవో అసోసియేషన్ నేతలు వైద్యనాథం, శశిధర్‌రెడ్డి, ఏఈవో అసోసియేషన్ నేతలు శ్రావణ్‌కుమార్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

హై రిస్క్‌లో భారీ వెంచర్లు

- డిప్యూటీ సీఎం ప్రజెంటేషన్‌లో 11 బడా నిర్మాణాలు
- వాటన్నింటి విలువ దాదాపు 15 వేల కోట్ల పైమాటే!
- అవన్నీ అక్రమమేనంటూ ప్రకటించిన భట్టి విక్రమార్క
- వాటన్నింటినీ కూల్చేస్తారా? లేదా క్రమబద్ధీకరిస్తారా?
- కోట్లు గుమ్మరించిన కొనుగోలుదారుల్లో టెన్షన్ టెన్షన్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): 'మియాపూర్‌లో ఉన్న ఒక ఆకాశహర్మ్యం చెరువులో నిర్మితమైంది.. పుప్పాలగూడలో చెరువును ఆక్రమించి ఏకంగా ఐటీ టవర్ నిర్మాణం జరిగింది..' ఇవేవో సామాన్యుడు చేస్తున్న ఆరోపణలు కాదు.. అధికారులు చేసిన హెచ్చరికలు అంతకన్నా కాదు.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బహిరంగంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించిన వివరాలు. పదకొండు భారీ నిర్మాణ ప్రాజెక్టులు అక్రమమని ఆయన ఆరోపించారు. వాస్తవంగా ఈ 11 ప్రాజెక్టులు మాత్రమే చెరువుల్లో ఉన్నాయా? హైడ్రా వీటిని కూడా కూల్చేస్తుందా? లేదంటే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందా? దాదాపు రూ.15 వేల కోట్లకుపైగా విలువైన ఈ నిర్మాణ ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకమేనా? కోట్లు గుమ్మరించి కొనుగోలు చేసినవారి పరిస్థితి ఏమిటి? అనే చర్చ సోషల్‌మీడియా వేదికగా నడుస్తున్నది. హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న 11 బడా ప్రాజెక్టులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమించాయంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా ఒక నివేదికను విడుదలచేశారు. ఆయా నిర్మాణాలతో చెరువుల స్వరూపమే మారిందని, మనుగడలో లేకుండా పోయాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ స్టేట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ అధికారులు రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. 2014 తర్వాత నగరంలో చెరువుల పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా జరిగాయని పేర్కొన్నారు. దీంతో ఈ బడా నిర్మాణాల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఈ అంశమే ఇప్పుడు కొనుగోలుదారులను కలవరపెడుతున్నది.

నివేదికలో 11 బడా నిర్మాణాలు

చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులను చెరిపివేసి నిర్మాణాలు జరిగాయంటూ ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో 11 బడా నిర్మాణాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న జాబితాలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని సాండియర్ స్కైలైన్, మియాపూర్‌లోని వెర్టెక్స్ విరాట్, పుప్పాలగూడలోని సుమధుర పాలైస్ రాయల్, సైబర్ సిటీలోని ఒరియానా, నెక్నాంపూర్‌లోని పూజా మ్యాజిక్ బ్రీజ్, బండ్లగూడ జాగీర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ బౌల్డర్ వుడ్స్, గోపన్‌పల్లిలోని వజ్రం ఇగ్జోరా, హానర్ సిగ్నాటిస్, పుప్పాలగూడలోని ఫోనిక్స్ 285 కమర్షియల్ బిల్డింగ్, ఫోనిక్స్ 25, వైష్ణవి సింబల్ వంటి నిర్మాణాలు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులను సమీపంలో ఉండే చెరువులు, కుంటలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారనేది ఆరోపణ.

భట్టి వ్యాఖ్యలతో భయాందోళనలు

చెరువులు, కుంటల పరిరక్షణతో సంబంధం లేకుండా కొన్ని ప్రాజెక్టులను ఎంపిక చేసుకుని భట్టి చేసిన వ్యాఖ్యలు వాటి కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన ప్రాజెక్టులన్నీ ఆక్రమణలేనని డిప్యూటీ సీఎం స్పష్టంచేయడంతో వాటిని కొనుగోలుచేసినవారికి హైడ్రా గుబులు పట్టుకున్నది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ప్రాజెక్టులను ప్రభుత్వం ఏం చేయబోతున్నది? ఆక్రమణలుగా గుర్తించిన ఈ ప్రాజెక్టులను కూల్చివేస్తారా? క్రమబద్ధీకరణ చేస్తారా? లేదా ఆయా బిల్డర్లు, నిర్మాణదారులను భయపెట్టి ప్రయోజనం పొందాలని చూస్తున్నారా? అనే ప్రశ్నలు సొంత పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారాయి.

15 వేల కోట్ల ప్రాజెక్టులకు ఎసరు?

- ఎఫ్‌టీఎల్ భూముల్లో ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ 11 ప్రాజెక్టుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.15 వేల కోట్లపైనే ఉంటుంది. ఇందులో కమర్షియల్ ఐటీ పార్కులతోపాటు రెసిడెన్షియల్, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ భవన నిర్మాణ అనుమతులతోపాటు రెరా ఆమోదం తెలిపిన ప్రాజెక్టులే కావడం గమనార్హం.
- నార్సింగి జంక్షన్‌కు సమీపంలోని పుప్పాలగూడలో సాండియార్ స్కైలైన్ విల్లా నగరంలోనే అత్యంత ఎత్తయిన ప్రాజెక్టుల్లో ఒకటి. 59 అంతస్తులు ఉండే నాలుగు భారీ టవర్లతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఐటీ కారిడార్ కేంద్రంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఖరీదు సుమారు రూ.1,050 కోట్లు. ఈ ప్రాజెక్టు మొత్తం కూడా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది.
- మియాపూర్ రామసముద్రం కుంట సమీపంలో చేపట్టిన వెర్టెక్స్ విరాట్ ప్రాజెక్టును ఎనిమిది ఎకరాలకుపైగా విస్తీర్ణంలో చేపట్టారు. ఈ ప్రాజెక్టులో 1,428 యూనిట్లను ఆరు స్కై స్క్రాపర్లతో సుమారు రూ.1,005 కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు మొత్తం చెరువు భూముల్లోనే నిర్మిస్తున్నారని నివేదిక పేర్కొన్నది.
- పుప్పాలగూడ ఖాజాగూడ సమీపంలో సుమధుర పాలైస్ రాయల్‌ను ఏడు ఎకరాల్లో 52 అంతస్తుల భారీ రెసిడెన్షియల్ టవర్‌ను దాదాపు రూ.215 కోట్లతో నిర్మించారు. దీనిని కూడా చెరువులను ఆక్రమించి నిర్మించారనేది ఆరోపణ.
- మూసాపేటలోని సేవాలాల్‌నగర్‌లో సైబర్‌సిటీ ఒరియానా పేరిట 28 అంతస్తుల భారీ భవంతులను నిర్మిస్తున్నారు. ఒక్కో ఫ్లోర్‌కు 10 ఫ్లాట్ల చొప్పున నిర్మిస్తున్నారు. దీని విలువ దాదాపు రూ.820 కోట్లు. దీనిని మూడు టవర్లతో నిర్మిస్తుండగా, ఇందులో ఒక టవర్ పూర్తిగా ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నట్టు గుర్తించారు.
- నెక్నాంపూర్ సమీపంలో అల్కాపూర్ టౌన్‌షిప్‌లో మ్యాజిక్‌బ్రీజ్ పేరిట 3.8 ఎకరాల విస్తీర్ణంలో 11 అంతస్తుల్లో భారీ ప్రాజెక్టును చేపట్టారు. దీని విలువ రూ.350 కోట్ల పైమాటే. డిప్యూటీ సీఎం విడుదల చేసిన నివేదిక ప్రకారం దీనిని కూడా సమీపంలో ఉండే కుంటను ఆక్రమించి నిర్మాణం చేపట్టారు.
- బండ్లగూడ జాగీర్‌లోని ఎస్ఎంఆర్ బౌల్డర్ వుడ్స్ ప్రాజెక్టును 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందులో 583 ఫ్లాట్లు ఉంటాయి. దీనిని దాదాపు రూ.470 కోట్లతో రెండు భారీ టవర్లతో నిర్మిస్తున్నారు. ఇందులో ఎత్తయిన టవర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నది.
- గోపన్‌పల్లి నుంచి నల్లగండ్ల వెళ్లే మార్గంలో వజ్రం ఇగ్జోరా పేరిట నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 17 ఫ్లోర్లతో కూడిన మూడు భారీ టవర్లను నిర్మిస్తున్నారు. 368 కుటుంబాలు నివాసం ఉండే ఈ ప్రాజెక్టు ఖరీదు రూ.370 కోట్లు. దీనిని కూడా ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మిస్తున్నట్టు నివేదిక తెలిపింది.
- కూకట్‌పల్లి నుంచి హైటెక్‌సిటీ వెళ్లే మార్గంలో హానర్ సిగ్నాటిస్ ప్రాజెక్టును సుమారు రూ.800 కోట్లతో 25 అంతస్తులు ఉండే 18 టవర్లను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో కొంత భాగంగా ఎఫ్టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్నట్టు నివేదిక పేర్కొన్నది.
- పుప్పాలగూడ కేంద్రంగా ఫోనిక్స్ సంస్థ 57 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద కమర్షియల్ సెజ్ పార్క్‌ను ఆరు టవర్లలో నిర్మిస్తున్నారు. దీని విలువ రూ.3,900 కోట్ల పైమాటే. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని ఎఫ్టీఎల్‌లోనే నిర్మిస్తున్నట్టు నివేదించారు. అదే సంస్థ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఫోనిక్స్ ట్రైటాన్ ప్రాజెక్టును 19.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నది. దీని మొత్తం విలువ రూ.1,420 కోట్లు. అయితే ఈ ప్రాజెక్టు మొత్తాన్ని కూడా చెరువుల భూముల్లోనే నిర్మించినట్టు గుర్తించారు.
- గచ్చిబౌలిలోని వైష్ణవి సింబల్ ఐటీ కమర్షియల్ పార్క్ విలువ రూ.600 కోట్లు ఉండగా ఈ ప్రాజెక్టు మొత్తం కూడా ఎఫ్టీఎల్ పరిధిలోనే ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు.

పార్లమెంట్ ఆఫీసెస్ ప్రాఫిట్ కమిటీ చైర్మన్‌గా ఈటల

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తేతెలంగాణ): పార్లమెంట్ ఆఫీసెస్ ఆఫ్ ప్రాఫిట్ జాయింట్ కమిటీ చైర్మన్‌గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్తు ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తురంగంలో పనిచేస్తున్న 19వేల మంది ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విద్యుత్తురంగ ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న విద్యుత్తురంగ ఆర్టిజన్ కార్మికులు గత 10 ఏండ్లుగా పదోన్నతులు లేకుండా, వేతనాలు పెరుగకుండా పని చేస్తున్నట్టు పేర్కొన్నారు. నిరంతరం విద్యుత్తు సరఫరాలో కీలకపాత్ర పోషిస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న ఆర్టిజన్స్ జీవితాలు ఇబ్బందులపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్స్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బానోతు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అల్లం ఓదేలు, డిప్యూటీ కార్యదర్శిగా బీ లక్ష్మయ్య, కార్యదర్శులుగా రాజునాయక్, కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రూ.10.61 కోట్ల మోసంలో ఇద్దరి అరెస్టు

- వృద్ధుల 'డిజిటల్ అరెస్టు' కేసులో పురోగతి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధ జంటను 'డిజిటల్ అరెస్టు' చేసి, రూ.10.61 కోట్లు కాజేసిన ఘటనలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) పోలీసులు పురోగతి సాధించారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేపట్టి.. కర్ణాటకకు చెందిన ఇద్దరు సైబర్ నేరస్థులను అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయెల్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన వృద్ధ దంపతులకు సెప్టెంబరు 10 సాయంత్రం 5 గంటలకు వీడియో కాల్ వచ్చింది. కాల్‌లో మాట్లాడిన ఇద్దరు తమను ముంబై పోలీసులుగా పరిచయం చేసుకున్నారు. ఆ దంపతుల ఆధార్, పాన్‌కార్డులను ఉపయోగించి బ్యాంకు ఖాతా తెరిచారని, దాని ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ.. ఆ నేరాలు రుజువైతే 7 ఏండ్ల వరకు జైలుశిక్ష పడుతుందని బెదిరించారు. ఆ కేసులు లేకుండా చేయాలంటే తమకు కోట్ల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని ఆ వృద్ధ దంపతులు చెప్పడంతో రూ.10.61 కోట్లను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. మోసపోయామని గ్రహించిన బాధితులు.. సీఎస్ పోలీసులను ఆశ్రయించగా బెంగళూరుకు చెందిన వినయ్‌కుమార్ ఖడ్కే, జీహెచ్ మారుతిని అరెస్టు చేసి 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 'టింకన్ టెక్నాలజీస్' ఖాతాకు రూ.4.62 కోట్లు బదిలీ చేసినట్టు గుర్తించారు.

కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రైతులకు మేలుచేసే విధంగా కార్పొరేషన్ల పనితీరు మెరుగుపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ కార్పొరేషన్ల పురోగతికి మంగళవారం సచివాలయంలో చైర్మన్లు, ఎండీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా మానిటరింగ్ మరింత సమర్థవంతంగా చేయాలని ఆదేశించారు. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలోని గోదాములను ఓకే గొడుకు కిందకు తీసుకోవాలని సూచించారు.

చెరువును చెరబట్టిన కాంగ్రెస్, టీడీపీ!

- రాష్ట్ర ఏర్పాటుకు ముందే హైదరాబాద్ చెరువుల ఆక్రమణ
- 45% చెరువుల కబ్జాలు ఆ రెండు పార్టీల ఏలుబడిలోనే
- 920 చెరువులకుగాను 421 చెరువుల ఆక్రమణ
- గడిచిన పదేండ్లలో 44 చెరువుల్లో ఆక్రమణలు
- గత ప్రభుత్వాల నిర్వాకాన్ని బట్టబయలు చేసిన భట్టి

సున్నం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలు(ఫైల్)

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్, టీడీపీ హైదరాబాద్ నగరంలోని చెరువులను చెరబట్టాయి. ఈ రెండు పార్టీల ఏలుబడిలోనే మెజార్టీ చెరువులు అన్యాక్రాంతమయ్యాయి. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చెప్పిన లెక్కలే చాటింపు వేస్తున్నాయి. డిప్యూటీ సీఎం చెప్పిన లెక్కల ప్రకారం.. హైదరాబాద్‌లో 920 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 225 చెరువులు ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. మరో 196 చెరువులను పాక్షికంగా ఆక్రమించారు. మిగిలిన 499 చెరువులు భద్రంగా ఉన్నట్టు భట్టి వివరించారు. అంటే ఈ లెక్కన మొత్తం చెరువుల్లో 421 చెరువులు కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ఆక్రమణకు గురైనట్టు ఆయనే తేల్చేశారు. మొత్తం చెరువుల్లో 45 శాతానికిపైగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందే ఆక్రమణలకు గురైనట్టు స్పష్టంచేశారు.

పదేండ్లలో 44 చెరువులు

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేండ్లలో 20 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని, ఉమ్మడి రాష్ట్రంలో పాక్షికంగా ఆక్రమణకు గురైన చెరువుల్లో మరో 24 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉమ్మడి ఏపీలో మరో 127 చెరువుల ఆక్రమణలపర్వం ప్రారంభంకాగా గత పదేండ్లలో ఈ ఆక్రమణలు పెరిగినట్టు వెల్లడించారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురికాగా, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో 20 చెరువులు మాత్రమే పూర్తిగా ఆక్రమణకు గురికావడం గమనార్హం. దీనిని బట్టి ఏ ప్రభుత్వాలు చెరువులను కాపాడాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. డిప్యూటీ సీఎం వెల్లడించిన అంకెలు, లెక్కలే చెరువుల పరిరక్షణలో ఉమ్మడి ఏపీలో పాలించిన కాంగ్రెస్, టీడీపీ పార్టీలు ఏ మేరకు శ్రద్ధ పెట్టాయో, తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఏ మేరకు శ్రద్ధ పెట్టిందో స్పష్టం చేస్తున్నాయి.

నాడు ఆక్రమణలు.. నేడు పెడబొబ్బలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నాడు టీడీపీ, కాంగ్రెస్‌లో కీలక నేతలే. నాడు చెరువుల ఆక్రమణలపై సడి చప్పుడు చేయని నేతలు ఇప్పుడు పెడబొబ్బలు పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు లెక్కలు చెప్తున్న డిప్యూటీ సీఎం నాడు ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఏం చేశారని పర్యావరణవేత్తలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పుడు కండ్ల ముందు కబ్జా అవుతున్నా పట్టించుకోకుండా, ఇప్పుడు తాము తప్ప మరెవరూ చెరువులను బాగు చేయలేరనే విధంగా ఏమిటని చర్చించుకుంటున్నారు.

హైదరాబాద్‌లోని మొత్తం చెరువులు	920
ఉమ్మడి ఏపీలో పూర్తిగా ఆక్రమణకు గురైనవి	225
పాక్షికంగా ఆక్రమణకు గురైన చెరువులు	196
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆక్రమణకు గురైనవి	20
గతంలో పాక్షికంగా ఆక్రమణకు గురై, స్వరాష్ట్రంలో పూర్తిగా ఆక్రమణకు గురైనవి	24

సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశమైన హైడ్రా కమిషనర్ రంగనాథ్

50 ఏండ్ల క్రితం చెరువులు ఎట్లున్నయ్?

- సర్వే ఆఫ్ ఇండియా రికార్డులపై ఆరా
- అధికారులతో హైడ్రా కమిషనర్ భేటీ
- సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిలో సమగ్రసర్వేకు ఆదేశించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో సమావేశమయ్యారు. హబ్సీగూడలోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైడ్రా అధికారుల బృందం హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల వివరాలు, ఇతర అంశాలపై సర్వే అధికారులతో చర్చించారు. 1971-72 సర్వే ప్రకారం నగరంలో ఉన్న చెరువులు, వాటి విస్తీర్ణంతోపాటు ప్రస్తుత పరిస్థితి అంశాలపై మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీదా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాలిట్‌తో పాటు ఇతర అధికారులు తమ వద్ద ఉన్న రికార్డులను హైడ్రా బృందానికి చూపించారు. యాభై ఏండ్ల క్రితం నగరంలో ఉన్న చెరువుల పరిస్థితిపై ఆనాటి మ్యాపులతోపాటు నేటి పరిస్థితిని పోలుస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. హెచ్ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాను సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారంతో పోల్చి చూసుకోవడానికి ప్రస్తుతం హైడ్రా కసరత్తు ప్రారంభించింది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు నిర్ధారించడంలో సర్వే ఆఫ్ ఇండియా భాగస్వామ్యం కోరారు. దీనికి తమ దగ్గర సిబ్బంది కొరత ఉన్నట్టుగా అధికారులు చెప్పినట్టు తెలిసింది. తమ బృందం పనిచేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తితే సర్వే పరంగా సహకారం అందించాలని కమిషనర్ సర్వే అధికారులను కోరినట్టు సమాచారం. మరోవైపు సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదిక తయారు చేయనున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించి.. ప్రాధాన్యక్రమంలో చెరువులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు తెలిపారు.

సమగ్ర సర్వే కష్టం!

- తేల్చిచెప్పిన హైడ్రా అధికారులు
- లేక్ ప్రొటెక్షన్ కమిటీలో చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో ఎన్ని చెరువులున్నాయి.. వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలను తేల్చాలి.. క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేసి రిపోర్టులను మూడు నెలల్లోగా అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో రీసర్వే, కూల్చివేతలకు సంబంధించి కీలక చర